క్లుప్తంగా

ఎనర్జీ క్లబ్ ఏర్పాటు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీచర్లు, విద్యార్థులు

మదనపల్లె సిటీ : స్థానిక బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎనర్జీ క్లబ్‌ను పాఠశాల హెచ్ఎం ఎం.రఘు, సీనియర్ ఉపాధ్యాయులు మురళీమోహన్ ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యుత్ పొదుపుని తెలిపే అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాకీర్‌హుస్సేన్, వాణి, సౌజన్య, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని శ్రీ కనుమలో గంగమ్మ జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. రాత్రి తిరునాల పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల కోసం క్యూ ఏర్పాటు చేశారు. బసినికొండ, రామాచార్లపల్లె, నిమ్మనపల్లె రోడ్డు, డ్రైవర్స్ కాలనీ, మొలకలదిన్నె,వలసపల్లె గ్రామాలకు చెందిన మహిళలు దీలు, బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అన్నదానం చేశారు.

కేంద్రసాయుధ బలగాలతో తనిఖీ



చెంబకూరులో తనిఖీ చేస్తున్న కేంద్ర బలగాలు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీలో శనివారం ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రతి గ్రామంలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ సందర్భంగా గ్రామాల్లో అక్రమ మద్యం, మారణాయుధాలు గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు



సారాఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కలకడ : నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 20 లీటర్లు సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం మండలంలోని దిగువతండా పంచాయతీ ఎగువతండా, దిగువతండా అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, సెంట్రల్‌పోర్స్ (కేంద్రబలగాలతో) వెళ్లి దాడులు నిర్వహించారు. గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో ముమ్మర తనిఖీ చేసి సారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు తప్పవన్నారు.

వెంకటేష్ సేవలు మరువలేనివి



వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామసముద్రం : మండలంలోని వనగానిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం మండల ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ 25ఏళ్ల పాటు వెంకటేష్ రామసముద్రం మండలంలో పలు పాఠశాలల్లో అంకితభావంతో విధులు నిర్వహించి, పిల్లల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. వెంకటేష్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, సురేష్, శంకర్, మహేంధర్‌రావు, నరసింహులు, చెంగల్రాయచారి, ప్రకాష్‌రెడ్డి, శివశంకర్, జగన్నాథ్ రెడ్డి, కేశవకుమార్, మనోహర, హేమలత, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం' సభను

విజయవంతం చేయండి

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



మేమంతా సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 2న మదనపల్లె టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సుయాత్రను, బహిరంగసభను విజయవంతం చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోటశ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ కోరారు. శనివారం పట్టణంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో మేమంతా సిద్ధం బహిరంగసభకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను..మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీమ్‌అస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం తదితరులతో కలిసి పరిశీలించారు. అన్నమయ్యజిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బహిరంగ సభకు జిల్లావ్యాప్తంగా లక్షల సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, స్టేజి నిర్మాణం, సిట్టింగ్ అరేంజ్‌మెంట్స్‌పై పలు సూచనలు చేశారు. మేమంతా సిద్ధం సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్న నేపథ్యంలో తదనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...మేమంతా సిద్ధం బస్సుయాత్ర ఏప్రిల్ 1వతేదీ సాయంత్రం తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువుకు చేరుకుంటుందన్నారు. ఆరోజు రాత్రి అక్కడే బసచేసి, మరుసటిరోజు ఏప్రిల్ 2 ఉదయం బయలుదేరి, మధ్యాహ్నం 3గంటలకు టిప్పుసుల్తాన్ మైదానం చేరుకుంటుందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి, ఐదేళ్ల తన పాలనలో ప్రతి ఒక్కరికీ అందించిన సంక్షేమం, అభివృద్ధి వివరించి, మంచి జరిగి ఉంటేనే తనను ఆశీర్వదించాల్సిందిగా కోరుతారన్నారు. మేమంతా సిద్ధం సభకు రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరుషఫీ, ఎస్.ఏ.కరీముల్లా, సురేంద్ర, తట్టినాగరాజరెడ్డి, బుల్లెట్ షఫీ, కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి



కలకడ : ముడియంవారిపల్లెలో ప్రచారం చేస్తున్న చింతల శివానందరెడ్డి



కలికిరి ఆర్.ఎస్.రోడ్డులో ఇంటింటా ప్రచారంలో నాయకులు

కలకడ : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ఆదరించి ఆశీర్వదించాలని వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి కోరారు. శనివారం మండలంలోని ముడియంవారిపల్లె, కొత్తపల్లె, హరిజనవాడ, తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎంపీగా పివి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ శాంతమ్మ, కమలాకర్‌రెడ్డి , సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, నరసింహారెడ్డి , కుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, హరినాథనాయుడు, కెఎస్ మస్తాన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఇంటింటా ప్రచారం

కలికిరి : సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కలికిరి పట్టణంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ పరిధిలోని రామాలయంలో ముందుగా పూజలు చేశారు. రామాలయం వీధి, ఆర్.ఎస్.రోడ్డు, బ్రాహ్మణ వీధి ప్రాంతాల్లో ఇంటింటా వైఎస్సార్‌సీపీ కరపత్రం అందచేసి రాజంపేట పార్లమెంటు సభ్యుల పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, కేఎంఆర్ బావాజాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి



ఎన్నికల ప్రచారంతో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడి అన్నారు. శనివారం మండలంలోని కావలిపల్లె పంచాయతీలోని ఒంటిల్లు, ఎంసీపాళెం, బోడినాయునిదొడ్డి, కురవపల్లె, ముల్లగూరవాండ్లపల్లె, ఆవులవారిపల్లె, మద్దిపట్లవారిపల్లె, హరిజనవాడ, వడ్డిపల్లె, చిగురపాటివారిపల్లె, పొంతచెరువుక్రాస్, దొడ్డివారిపాళెం, దుర్గంవారిపల్లెలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి చూపించారని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వందశాతం అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రెడ్డెమ్మ, రాజేష్, నాయకులు లోకనాథరెడ్డి, బాబురెడ్డి, చెంగల్‌రాయుడు, ప్రసాద్, అశోక్‌నాయుడు, సుబ్బానాయుడు, అమరనాథనాయుడు, వెంకటప్ప నాయుడు, కిరణ్, బాలాజీనాయుడు, మధుసూదన్‌రెడ్డి, రమేష్, సైషావలి తదితరులు పాల్గొన్నారు.

మంచికోసం జగనే మళ్లీ సీఎం అవ్వాలి

వాల్మీకిపురం : ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని నాయక్‌వీధిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోరుతూ పథకాలను అమలు చేస్తున్నారని, కానీ గతంలో టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కేవలం టిడిపి నాయకులే దోచుకుని పంచుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన ఆందిస్తున్నారన్నారు. బీసీలకు అమలు చేసిన నవరత్నాల పథకాలతో బెంబేలెత్తిన చంద్రబాబు బీసీ డిక్లరేషన్ అంటూ మాయ మాటలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలీం, మహబూబ్‌బాషా, సైపుల్లా, చికెన్‌మస్తాన్, ఖాదరి, షాహెద్, రమేష్, ఆంజి, సాధిక్, రఘు, ముబారక్, ఉమ్మర్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఇంజనీర్ సందీప్‌కుమార్

మదనపల్లె సిటీ : కంప్యూటర్ సైన్స్ రంగంలో కొత్త టెక్నాలజీలను ఉపయోగించుకుని ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం కాలేజీలో సాంకేతికత, అనుకూలతలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన టెక్నాలజీ ఉపయోగించుకుని ఐటీ రంగంలో ఉద్యోగ అకాశాలు పొందవచ్చునని తెలిపారు. ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్,బ్లాక్ చైన్ టెక్నాలజీస్, రోబోటిక్స్, వర్చువల్ రియాల్టీ వంటి కొత్త టెక్నాలజీలు కంప్యూటర్ సైన్స్‌రంగంలో ముందంజలో ఉన్నాయన్నారు. కంప్యూటర్ సైన్స్ రంగంలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ అసోసియేటివ్ ఇంజనీర్ సందీప్‌కుమార్, ఎం.డి.షఫీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వండి



గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

నిమ్మనపల్లె : తాగునీటి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఎంపీడీఓ షౌలేట్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండలంలోని బండ్లపై, తవళం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలంలో తలెత్తే తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించి చర్యలను చేపట్టాలన్నారు. నీటి వృథా అరికట్టి, తాగునీటి పైపుల మరమ్మతులు, నీటి సరఫరా అంతరాయాలు తదితర సమస్యలను వెంటనే గుర్తించాలన్నారు. సర్పంచులతో సమన్వయం చేసుకొని తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున, ఎన్నికల కోడ్ కు అనుగుణంగా విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించిన వారిపై తక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ను అతిక్రమించి వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కే. రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ నిర్మాణంపై మధ్యంతర ఉత్తర్వులు

మదనపల్లె : నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి సంబంధించి కొండామర్రిపల్లె పంచాయతీ బైపాస్‌రోడ్‌లో కేటాయించిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. కొండామర్రిపల్లె పంచాయతీకి చెందిన రామాపురం వెంకటమ్మ, రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ భవనానికి కేటాయించిన సర్వేనెంబర్లలోని 235/5లో 1.53 ఎకరాలు, 235/7లో 0.23 సెంట్లు భూమి.. 40 ఏళ్లుగా తన అనుభవంలో ఉందని, రెవెన్యూ అధికారులు తనకు నోటీసు, భూపరిహారం ఇవ్వకుండా సబ్‌డివిజన్ చేయడంతో పాటు కేటాయింపు ఉత్తర్వులు ఇవ్వడంపై హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 19న హైకోర్టులో ఇరుపక్షాలను విచారించిన న్యాయమూర్తి, 29న భవన నిర్మాణపనులు నిలుపుదల చేయాల్సిందిగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తీర్పు ఇచ్చారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కలికిరి : కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీన వరకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్-2024)కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత మెటీరియల్, శిక్షణ పూర్తి అయిన అనంతరం పాలిసెట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు హాల్‌టిక్కెట్లు, పాస్‌ఫోర్ట్ ఫొటోలు, ఆధార్ జిరాక్స్, మొబైల్ ఫోన్ తీసుకురావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు ఫీజు రూ.100, బీసీ,ఓసీ విద్యార్థులు రూ.400 ఫీజుతో కళాశాలలోనే దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ఈ నెల 27న ప్రవేశ జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9505504200, 9966209000 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు

మదనపల్లె : పట్టణంలోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిదారులు ఇంటి పన్నులు, ఖాళీస్థలం పన్నులు పెనాల్టీ లేకుండా చెల్లించేందుకు మార్చి 31 గడువుతేదీ కావడంతో... ఆదివారం పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో.. పన్ను చెల్లింపుదారులు ఆదివారం పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటిపన్నులు, ఖాళీస్థలం పన్నులు, నీటిచార్జీలు గడువు తేదీలోపు చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు.

వైభవంగా శయనోత్సవం



ప్రత్యేక అలంకరణలో గట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం : మండల కేంద్రలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణ స్వామి ఉత్సవాలలో భాగంగా శనివారం వైభవంగా శయనోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

జేసీ ఫర్మాన్‌అహ్మద్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్

పీలేరు : ఎన్నికల విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో ఉన్న నోడల్ ఆఫీసర్లు, కంట్రోల్ రూము స్టాఫ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నుంచి రోజువారి ఎన్ని వెహికల్ పర్మీషన్లు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమానికి 843 మంది హాజరుకాగా, 30 మంది గైర్హాజరైనట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

చేయి చేయి కలుపుదాం..

శక్తి వనరులు పొదుపు చేద్దాం



శక్తి వనరుల పొదుపుపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శ్రీదేవి

వాల్మీకిపురం : చేయి చేయి కలుపుదాం.. శక్తి వనరులను పొదుపు చేద్దామని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఆధ్వర్యంలో శక్తివనరుల పొదుపుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఇండ్లలో చిన్న చిన్న ఉపాయాలతో ప్రతి నెలా కొన్ని యూనిట్ల విద్యుత్‌ను పొదుపు చేసే విధంగా అలవాటు చేసుకోవాలన్నారు. శక్తివనరులను పొదుపుగా వాడుకోవాలని, ఐదు నక్షత్రాల విద్యుత్ ఉపకరణాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు శోభారాణి, అనురాధ, సుధారాణి, రాధ, ఉమా, షబ్బీర్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో

కర్ణాటక మద్యం, నాటుసారా సీజ్

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- ఆటో, ద్విచక్రవాహనాలు స్వాధీనం



కర్ణాటక మద్యం తరలిస్తున్న నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : ఎస్ఈబీ మదనపల్లె స్టేషన్ పరిధిలో... శుక్ర, శనివారాల్లో జరిపిన తనిఖీల్లో వివిధ ప్రాంతాల్లో కర్ణాటక మద్యం, నాటుసారా స్వాధీనం చేసుకుని, ఏడుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం బాలసానిపల్లె గ్రామంకు చెందిన ఎం. బాబు(49) ఇంటి పెరట్లో 261 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు దాచిపెట్టడం గమనించి, అరెస్ట్‌చేసి, సరుకును సీజ్ చేశామన్నారు. అలాగే కర్ణాటక రాయల్పాడు మండలగడ్డ గ్రామానికి చెందిన జీ.ఏ.సుబ్రహ్మణ్యం, ద్విచక్రవాహనంలో 302 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తీసుకువచ్చి, మదనపల్లె మండలం రేగంటి వారిపల్లెకు చెందిన సీహెచ్.రమేష్(33), సీటీఎంకు చెందిన షికారిచందు(23)కు చెందిన ఆటోలో సరుకును చేరవేస్తుండగా, రూ.18,810 విలువైన సరుకును సీజ్ చేశామన్నారు. ఆటో, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. మదనపల్లె డీటీఎఫ్ అధికారులు ముదివేడు వద్ద జరిపిన తనిఖీల్లో.. తంబళ్లపల్లె మండలం మాదిగపల్లెకు చెందిన ఏ.బాబు ద్విచక్రవాహనంలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే మదనపల్లె మండలం కోటవారిపల్లె తండాకు చెందిన నిర్మల(25) 15 లీటర్ల సారాను తీసుకెళుతుండగా, పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. వలసపల్లెకు చెందిన వి.సుజాత వద్ద 25 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఆయా ఘటనల్లో మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు.

గంజాయి కేసులో మరో ఇద్దరు అరెస్టు

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాలకు సరిహద్దులోని సంద్రడవి అటవీ ప్రాంతంలో ఫిబ్రవరి 5న గంజాయి అక్రమ రవాణా ముఠా సభ్యులు పట్టుబడిన విషయం పాఠకులకు తెలిసిందే. అంతేగాక పట్టుబడిన ఆరుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద లభించిన రూ.30 లక్షల విలువ చేసే 50 గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు కార్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ముఠా సభ్యుల్లో తప్పించుకు తిరుగుతున్న వారిలో మదనపల్లి సమీపంలోని బీకే పల్లికి చెందిన గంటా భాగ్యమ్మ (29), సీటీఎంకు చెందిన కూరాకుల మహేష్ (24)లను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు, పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు అప్పట్లో పారబోసిన గంజాయి ప్యాకెట్లను వెతికేందుకు సంద్రడవికి వచ్చి తచ్చాడుతుండగా వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.